క్లుప్తంగా

నర్సరీ రైతులకు సహకరించాలి

కడియం: కడియం ప్రాంత నర్సరీ రైతులకు మట్టి రవాణా కోసం పోలీసు శాఖ సహకరించాలని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ కోరారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ జీవీజీ తిలక్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. మట్టి రవాణా లారీలపై పోలీసులు ఆంక్షలు విధిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీలత

కడియం: వీరవరం - కడియం రోడ్డులో బేతాళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.శ్రీలత గురువారం ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యత, నమ్మకంతో సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

సంహితలో జాబ్‌మేళా

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో ఆలీవ్ ఫౌండేషన్, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. క్యాప్ జెమినీ, ఐసీఐసీఐ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, డెక్కన్ ఫార్మా, అపోలో ఫార్మసీ కంపెనీలు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 470 మంది విద్యార్థులు హాజరు కాగా 192 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ముందుకు వెళ్లాలని కళాశాల ఏవో జి.బాలకృష్ణ అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.2.10 లక్షల నుంచి రూ.6.6 లక్షల వరకు వార్షికాదాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టీఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, ఆంధ్రప్రదేశ్ పిలుపు మేరకు ఆర్ట్స్ కళాశాల వద్ద శనివారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు. సంఘ సర్వసభ్య సమావేశం నెహ్రూనగర్ మున్సిపల్ స్కూలులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని విధ్వంసం చేసే అనేక అసమానతలు తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. దీనికి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్ మృతి



రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు మట్టా శ్రీనివాస్ గౌడ్ (49) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనారోగ్యంతో చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహం చెన్నై నుంచి గురువారం ఉదయం కోలమూరుకు చేరుకుంది. వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి రొంగల జగన్నాథం తదితరులు నివాళులర్పించారు. కోటిలింగాలరేవులో అంత్యక్రియలు జరిపారు.

తాగునీరు వృథా



లీకవుతున్న నీరు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోట కన్నమ్మతల్లిగుడి వీధిలో పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. నాలుగు నెలలుగా ఈ సమస్య ఉంది. దీనివల్ల నీరు వృథాగా పోతుండడంతో పాటు డ్రైనేజీ నీరు కలిసే అవకాశముంది. నగరపాలకసంస్థ అధికారులు స్పందించి పైపులైను లీకేజీని అరికట్టాలని దుంపా చంద్రారెడ్డి కోరారు.

గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి

- పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ ఆకులవీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని మున్సిపల్ కల్యాణ మండపంలో గురువారం నగర పాలక సంస్థ పరిధిలోని రూరల్ డివిజన్ల వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమావేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ వైఎస్సార్ కుటుంబంలా సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసేవలో సీఎం జగన్‌కు తోడుగా ఉండాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ, దానికి అనుకూల మీడియా అబద్ధపు రాతలు, పుకార్లను ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ నెల 20 నుంచి 27 వరకూ నిర్వహించే జగనన్నే మా భవిష్యత్తు (జేఎంబీ) కార్యక్రమాన్ని అన్ని వార్డు సచివాలయాల్లో విజయవంతం చేయాలన్నారు.

మరింత బలంగా ప్రజల్లోకి : ఆకుల వీర్రాజు

పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీని మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో చందన నాగేశ్వర్ విజయానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి ప్రతినిధులుగా వెళ్లండి : మేకా శేషుబాబు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినిధులుగా భావించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి మేలు చేకూరేలా ముఖ్యమంత్రి జగన్ పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆర్థిక సమస్యలు ఎదురైనా లెక్కచేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులకు సైతం పథకాలు అందిస్తూ దేశంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు అండదండలు జగనన్నకే ఉన్నాయని, అందుకే లోకేష్ పాదయాత్రకు స్పందన లేదని వివరించారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం ×మా నమ్మకం నువ్వే జగన్× అనే నినాదంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కల్పించారు. డివిజన్ల జేసీఎస్ కన్వీనర్ కొప్పిసీడి ప్రసాద్ బాబు (రాజమౌళి), రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో ఎన్నో మార్పులు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో ఎన్నో మార్పులు తెస్తోందని, బోధనలో ఆధునిక టెక్నాలజీకి పెద్దపీట వేస్తోందని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులతో ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్, ప్రగతిపై చర్చించారు. ఎంతో విలువైన బైజూస్ కంటెంట్‌ను సద్వినియోగం చేయాలని సూచించారు. ట్యాబ్‌లో నిర్దేశిత లక్ష్యాన్ని నూరుశాతం సాధించిన బత్తుల ధర్మతేజను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులు బి.చిట్టిబాబును అభినందించారు. ఫార్మేటివ్ పరీక్షలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయిని బి.శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేపరుమిల్లు కార్మికుల దీక్ష

ప్రకాశం నగర్: ఏపీ పేపర్ మిల్లు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 30వ రోజు కొనసాగాయి. దీక్షలో కూర్చున్న కార్మికులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పేపర్ మిల్లు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం 30 రోజులుగా రిలే దీక్ష చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. యాజమాన్యం మొండివైఖరిని వదిలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎస్.వెంకటేశ్వరరావు, ఈవీ వెంకట్రావు, జీఎస్ఆర్ రెడ్డి, జి.నాగేంద్ర, బి.రామారావు దీక్షలో కూర్చున్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక శాఖ అధికారులు

కంబాలచెరువు: వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు చేపట్టినట్టు, ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బీఎస్ఎం వల్లీ అన్నారు. వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆ వ్యవస్థ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు గురువారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు వెట్టిచాకిరీలో మగ్గుతున్నవారి సర్వే, గుర్తింపు, విడుదల, పునరావాసంపై ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. కొంత సొమ్ము అప్పుగా తీసుకొని, దళారీల చేతిలో మోసపోయి, యజమాని చేతిలో చిత్రహింసలకు గురవుతూ బయట ప్రపంచానికి తెలియకుండా, స్వేచ్ఛలేని జీవితాన్ని గడుపుతూ, వెట్టి చాకిరీ వ్యవస్థ కోరల్లో చిక్కుకొన్న అభాగ్యులను రక్షించడానికి వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం ఉందన్నారు. ఇలా ఎవరైనా పనిచేస్తే వెంటనే ఆ సమాచారాన్ని కార్మిక శాఖ, పోలీసులు, చైల్డ్‌లైన్‌కు తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, డీఎస్పీ శ్రీలత పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్టాలిన్

కడియం: క్రీడలతో స్నేహ సంబంధాలు మరింత మెరుగుపడతాయని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. చిటికిన సతీష్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొత్తం 20 టీములు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. సతీష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

ప్రజలకు నూరుశాతం పథకాలు



మాధవీలత, కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, పౌర సేవలు నూరు శాతం ప్రజలకు అందేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆమె గురువారం మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు 337కి 175 పూర్తి చేశామన్నారు. ఆరోగ్య శాఖ పరిధిలో 33 పోస్టులు భర్తీ చేసినట్టు తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ 1,247 మంది వైద్య అనుబంధ అధికారులు, సిబ్బందిలో 1,239 మంది రిజిస్ట్రేషన్ చేశామని, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా జనవరిలో 15,250 మందికి, ఫిబ్రవరిలో 8వ తేదీ వరకు 5,679 మందికి వైద్యసేవలు అందించారన్నారు. మాతా,శిశు సంక్షేమ, పౌష్టికాహారం అందజేసే ప్రక్రియపై మరింత దృష్టి సారించామన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న మూడు పీహెచ్‌సీలు పురోగతిలో ఉన్నాయని, పీహెచ్‌సీల్లో మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఖాళీగా ఉన్న 22 అంగన్‌వాడీ, 63 ఆశ వర్కర్ల పోస్టులు భర్తీ చేశామన్నారు. జిల్లాలో 8,312 మంది గర్భిణులు నమోదయ్యారని, వారిలో రక్తహీనత తేలికపాటి లక్షణాలు ఉన్నవారు 1,478, మోస్తరు లక్షణాలున్నవారు 232 మంది ఉన్నారని, వారికి అవసరమైన పౌష్టికాహారం, ఐరెన్ టాబ్లెట్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలో 2,679 మంది బరువు తక్కువ ఉన్న వారికి ప్రత్యేక వైఎస్సార్ సంపూర్ణ ఆహార పథకం కిట్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలో గుర్తించిన 36 స్కూళ్ల హాస్టళ్ల పరిధిలోని 736 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఐపీడీఎస్ పీడీ కె.విజయ కుమారి, డీఈవో ఎస్.అబ్రహం పాల్గొన్నారు.

రేపటి నుంచి జాగృతి ఉద్యమం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మిక సంస్థ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మానవత నైతికత అనే నినాదంతో జాగృతి ఉద్యమం నిర్వహిస్తున్నట్లు జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర సందేశ కార్యదర్శి జనాబ్ హిమాయత్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నాడు కానీ, మానవతా విలువలు దిగజారుతున్నాయన్నారు. పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలే ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తాయన్నారు. మనిషిలో నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవతా విలువలు వికసిస్తాయన్నారు. అనంతరం ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఇమ్రాన్ షరీఫ్, అల్లావుద్దీన్ షరీఫ్, మన్సూర్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) అసోసియేషన్ 2023 సంవత్సరానికి సంబంధించిన డైరీని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. అనంతరం తొలి డైరీని డీఆర్‌ఓ జి.నర్సింహులు, ఆర్డీవో చైత్రవర్షిణి సంయుక్తంగా కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గీతాంజలి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సమయాల్లో మార్పు చేయించండి



కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సరీ రైతులు

కడియం: కడియం ప్రాంత నర్సరీలకు విద్యుత్ సరఫరా సమయాలను మార్పు చేయించాల్సిందిగా వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను నర్సరీ రైతులు కోరారు. ఈ మేరకు గురువారం నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా చంటియ్య ఆధ్వర్యంలో పలువురు రైతులు ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తెల్లవారుజాము నాలుగు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. దీనివల్ల కలిగే ఇబ్బందులను చందన దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే నర్సరీలకు మట్టి రవాణా చేస్తున్న లారీలపై కడియం పోలీసులు విధిస్తున్న ఆంక్షల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని చందన హామీ ఇచ్చారని పుల్లా చంటియ్య స్థానిక విలేకరులకు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి నాగ శివాజీ, కార్యదర్శి బొర్సు సుబ్బారాయుడు, సహాయ కార్యదర్శి ధర్మాసనం శివరామకృష్ణ పాల్గొన్నారు. అలాగే కడియం పోలీసు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్‌ను కూడా కలిసి మట్టి రవాణాకు ఇబ్బందుల్లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాంధీపార్క్ ఏరియా, టీటీడీ కల్యాణమండపం వీధి, గానుగ వీధి, పాండురంగస్వామి గుడివీధి ఏరియాల్లో సరఫరా ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మోరంపూడి, సాయినగర్, అరవింద్ నగర్, గాదాలమ్మ నగర్, గణేష్ నగర్, అల్కాపురి లేఅవుట్, బుచ్చయ్య నగర్, హుకుంపేట, మీనాక్షి లేఅవుట్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జయకృష్ణాపురం, వీరభద్రపురం, ఇన్‌కంటాక్స్ ఆఫీస్ ఏరియా, కోరుకొండ రోడ్డు, ఆదెమ్మదిబ్బ, హరిపురం, సుబ్బారాయపురం, లలిత నగర్, విద్యానగర్, పీఅండ్‌టీ కాలనీ, సుభాష్ నగర్ ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థుల దుర్మరణం



జానకిరామ్ (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం: జాతీయ రహదారిపై పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు, సహచర విద్యార్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మోకా జానకిరామ్ (21) జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన కొట్టేటి సాయికుమార్ (22) ఇదే కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో ఏడాది పూర్తయి బ్యాక్‌లాగ్‌లు ఉండటంతో సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరూ వేగవరంలో ఓ రూమ్‌ను అద్దెకు తీసుకుని ఉంటున్నారు. గురువారం సాయంత్రం వ్యక్తిగత పనులపై ఇద్దరూ బుల్లెట్‌పై జంగారెడ్డిగూడెం వెళుతున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి జంగారెడ్డిగూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న లారీని బుల్లెట్ ఢీకొంది. దీంతో జానకిరామ్ తలపైభాగం నుంచి లారీ దూసుకుపోగా, సాయికుమార్ లారీ వెనుక చక్రాల మధ్య ఇరుక్కుపోయి ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు, సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. సహచర విద్యార్థుల సహాయంతో ఇద్దరి మృతదేహాలను మానవతకు చెందిన వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. జానకిరామ్, సాయికుమార్ ప్రయాణిస్తున్న బుల్లెట్‌కు ఒక సీటే ఉండటం గమనార్హం. సహచర విద్యార్థులు తెలిపిన వివరాలు ప్రకారం వేగవరంలో వీరు బయలుదేరే సమయంలో బుల్లెట్‌ను జానకిరామ్ నడుపుతున్నట్లు చెబుతున్నారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం అని చెబుతున్నారు. కాగా వీరి మృతిపై సహచర విద్యార్థులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కళ్ల ముందే బయలుదేరిన కొద్దిసేపటికే విగత జీవులుగా మారడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

జనసేన జెండా స్తూపం ఆవిష్కరణ

ప్రకాశం నగర్: జనసేన నాయకుడు నర్సిపూడి రాంబాబు ఆధ్వర్యంలో గురువారం స్థానిక 49వ డివిజన్‌లో ఆ పార్టీ జెండా స్తూపాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

పెదపూడి: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం ఏడీఏ పి.స్వాతి హెచ్చరించారు. ఆమె పెదపూడి, దోమాడ, కరకుదురు తదితర గ్రామాల్లో ఎరువుల షాపులను తనిఖీ చేశారు.ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించిన రశీదులను తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. షాపు యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయాలు చేపట్టకపోతే సంబంధిత షాపుల్ని బ్లాక్ లిస్టులో పెడతామన్నారు.

లోవోల్టేజ్ సమస్య నివారణకు చర్యలు



వెలుగుబందలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన

రాజానగరం: నియోజకవర్గంలో లోవోల్టేజ్ సమస్య ఎదురుకాకుండా అవసరమైన ప్రతిచోటా విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాధేయపాలెం, వెలుగుబందలో రూ.8 కోట్లతో ఏర్పాటు చేయనున్న రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ, వ్యవసాయ, పరిశ్రమ అవసరాలకు కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెట్ట ప్రాంతమైన రాజానగరం మండలంలో ఎక్కువగా రైతాంగం బోర్ల పైనే ఆధారపడి సాగు చేస్తుంటారన్నారు. గతంలో ఈ మండలం కడియం నియోజకవర్గంలో ఉండేదని, ఆ సమయంలోనే తన తండ్రి ఎమ్మెల్యే, మంత్రిగా ఈ ప్రాంతంలో విరివిగా విద్యుత్ సబ్‌స్టేషన్లు తీసుకువచ్చారన్నారు. ఆ తరువాత పెరిగిన అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరికొన్ని ప్రాంతాలలో అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాధేయపాలెంలో రూ. 2.8 కోట్లు, వెలుగుబంద జగనన్న కాలనీలో రూ. 5 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు నాలుగు నెలల్లో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, సర్పంచ్ నురుకుర్తి దుర్గ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద పాల్గొన్నారు.

వ్యక్తికి రెండున్నరేళ్ల జైలు

కడియం: నిర్లక్ష్యంగా కారు నడిపి ఒకరి మృతికి, మరొకరు గాయపడటానికి కారణమైన పోలా లక్ష్మీనాయుడు అనే లెక్చరర్‌కు రెండున్నరేళ్ల జైలు, రూ.11 వేల జరిమానా విధిస్తూ ఏడో అదనపు కోర్టు మేజిస్ట్రేట్ జి.రామకృష్ణ తీర్పుచెప్పారు. ఆ వివరాలను కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ జీవీజీ తిలక్ స్థానిక విలేకరులకు తెలిపారు. 2017న లక్ష్మీనాయుడు మరో ఇద్దరిలో కలిసి రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం కారులో వెళుతున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేమగిరి వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనాయుడు పక్కనే కూర్చున్న వ్యక్తి మృతి చెందగా, వెనుక కూర్చున్న బాలుడు గాయాలపాలయ్యారు. లక్ష్మీనాయుడు నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసు దర్యాప్తులో తేలింది. పీపీగా మహాలక్ష్మి వ్యవహరించారు.

సాక్షి-సినిమా



శ్యామల :	అమిగోస్
సూర్యమినీ :	వసంతకోకిల
సూర్యప్యాలెస్ :	అమిగోస్
స్వామి :	వాల్తేరువీరయ్య
శివజ్యోతి :	పాప్‌కార్న్
అనుశ్రీ :	టైటానిక్
రాజా :	పఠాన్
అశోక :	వీరసింహారెడ్డి
కుమారి :	మైఖేల్
ఊర్వశి :	వారసుడు
రంభ :	వేద
మేనక :	ఐపీఎల్
గీతాఅప్సర :	రైటర్ పద్మభూషణ్
నామవరం	
వీఎస్ మహల్ :	అమిగోస్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	అమిగోస్
కడియం	
వెంకటసూర్య :	అమిగోస్